14న అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన దీక్ష

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బోయ/వాల్మీకి, బెంతు ఒరియా సహా అనుబంధ కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 14న అల్లూరి జిల్లా పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని అంబేద్కర్ విగ్రహాల వద్ద చేపట్టే ఒకరోజు నిరసన దీక్షను విజయవంతం చేయాలని జెఎసి జిల్లా కన్వీనర్ రామారావు దొర పిలుపునిచ్చారు. 14న. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అంబేద్కర్ విగ్రహాల వద్ద ఒక రోజు నిరసన దీక్ష నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకతను తెలపాలని కోరారు. ఆదివాసీల మనుగడ, హక్కుల చట్టాల రక్షణ కోసం 14న నిర్వహించే దీక్షల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టనున్న ఈ దీక్ష శిబిరాలు పాడేరు డివిజన్ పరిధిలో పాడేరు, చింతపల్లి, అరుకులోయ ప్రధాన కేంద్రాలలో పూర్తిస్థాయి దీక్షలు నిర్వహించాలని, మిగతా మండలాల్లో పరిస్థితులకనుగుణంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకునే వరకు వివిధ రూపాల్లో పోరాటాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై...

గిరిజన ప్రజాప్రతినిధులకు నిరసన సెగ

- అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ, జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర అడ్డగింత
- గిరిజన ద్రోహులు గోబ్యాక్ అంటూ పెద్దఎత్తున నినాదాలు

ఎమ్మెల్యే ఫాల్గుణ, జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్రలను అడ్డుకున్న గిరిజనులు

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు :బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ గిరిజన ప్రజాప్రతినిధులను నిరసన సెగ తగిలింది. మంగళవారం ముంచంగిపుట్టు పర్యటనకు వచ్చిన అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, ఉమ్మడి విశాఖ జిల్లాల జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లి సుభద్రలను స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య, మండల కార్యదర్శి ఎం.ఎం శ్రీను, ఆధ్వర్యంలో సంఘం నేతలు, గిరిజనులు అడ్డుకుని, అసెంబ్లీలో తీర్మానంపై నిలదీసి ప్రశ్నించారు. బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానానికి మౌనంతో తలూపి, గిరిజనులకు అన్యాయం చేసిన ద్రోహులు గోబ్యాక్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేతలు మాట్లాడుతూ, బెంతు ఒరియాలు, బోయ/ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై కర్నూల్‌లో వారంతా విజయోత్సవాలు జరుపుకుంటే వైసిపి మంత్రులు పాల్గొన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీని వల్ల గిరిజనులకు అన్యాయం జరుగుతోందని ఆందోళనలు చేస్తుంటే నోరు మెదపకుండా గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదనను వ్యక్తపరిచారు. ఓట్లేసి గెలిపించిన గిరిజన జాతికి ద్రోహం చేస్తున్న వారంతా తమ పదవుల రాజీనామా చేసి, పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిఒ52ను వ్యతిరేకిస్తున్నామని, దీనిపై లోలోపల పోరాటం చేస్తున్నామని చెబితే నమ్మే పరిస్థితి లేదని,బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే ప్రభుత్వ తీర్మానంపై మీ వైఖరి ఏమిటో పత్రికాముఖంగా బహిరంగంగా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం వైసిపి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తూ, గిరిజనులకు అన్యాయం చేస్తూ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేతలు, గిరిజనులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టడంతో పోలీసులు రంగప్రవేశం చేసి అడ్డుకున్నారు. ఆందోళనకారులను దూరంగా తోసే ప్రయత్నంలో స్వల్ప ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది.

గిరిజన సంఘం నేతలు, గిరిజనులు ముఖానే నిలదీసి ప్రయత్నించడంతో సమాధానం చెప్పేందుకు కాసేపు తడబాటైన ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ, గిరిజనులకు అన్యాయం జరిగేలా బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరిస్తే తాను రాజకీయాలను వదులుకుంటానని వెల్లడించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర స్పందిస్తూ, తామూ ఈ తీర్మానం, ఉత్తర్వులకు వ్యతిరేకంగా పార్టీలో అంతర్గతంగా పోరాటం చేస్తున్నామని, మీరంతా అధికార పక్షం కాకపోవడంతో బహిరంగంగా ఆందోళన చేస్తున్నారని వారించే ప్రయత్నం చేసినా ఆందోళనకారులు శాంతించలేదు. గిరిజన హక్కులకు భంగం వాటిల్లే ఎటువంటి చర్యలనైనా అడ్డుకుని తీరుతామన్నారు. పోలీసుల బలప్రయోగం చేసి అడ్డుకోవాలని ప్రయత్నిస్తే, తూటాలకు ప్రాణాలను బలిపెట్టయినా హక్కులను పరిరక్షించుకుంటామని స్పష్టం చేశారు. ఆందోళనలో మండల వైస్ ఎంపిపి-1 పాటు బోయి సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కోర్రా త్రినాథ్, సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు గాసిం దొర, వంతల లైకోన్, రామదాసు, శ్రీను గిరిజన మహిళ సంఘం (ఐద్వా) మండల అధ్యక్షురాలు సీసా విజయలక్ష్మి, మండల కమిటీ సభ్యురాలు సోనియా ఈశ్వరి, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

నిరసనలపై నిర్బంధం

పోలీసు నిర్బంధంలో గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి, రంపచోడవరం, మారేడుమిల్లి

బోయ, వాల్మీకి, బెంతు, ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానానికి గిరిజన ఎమ్మెల్యేలు ఆమోదం తెలపడంపై ఏజెన్సీలో పెద్ద ఎత్తున నిరసనలు ఎగసిపడుతున్న తరుణంలో ప్రభుత్వం నిర్బంధానికి పూనుకుంది. ఇప్పటికే రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మిని రంపచోడవరం, చింతూరు ఏజెన్సీలోని పలు చోట్ల ఆదివాసీలు అడ్డుకొని నిలదీసిన విషయం తెలిసిందే. సోమవారం కూడా ఎమ్మెల్యే ధనలక్ష్మిని మారేడుమిల్లిలో అడ్డుకొని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పర్యటనలో నిలదీతలు, ప్రశ్నించడాన్ని తప్పించుకోవడానికి గిరిజన నేతలను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పోలీసులు పూనుకున్నారు. రంపచోడవరం తహశీల్దారు కార్యాలయం వద్ద ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధనలక్ష్మి మంగళవారం హాజరైన తరుణంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావును రాజవొమ్మంగి మండలం లోదొడ్డి గ్రామంలో ఆయన నివాసం వద్ద పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మారేడుమిల్లిలో గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి నాయకులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, పల్లాల రాజకుమార్ రెడ్డి, కర్రి సన్యాసిరెడ్డి, ఆవుల ధర్మారెడ్డి, రేవుల జానకి రెడ్డిని అరెస్టు చేసి రోజంతా పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. 151 సెక్షన్ కింద బైండోవర్ కేసు పెట్టి సెల్ఫ్ బెయిల్‌పై విడుదల చేశారు. రంపచోడవరం మండల కేంద్రంలోని రెడ్డిపేటలో గిరిజన సంఘం నాయకులు మట్ల వాణిశ్రీని ఆమె నివాసం వద్ద పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రంపచోడవరం బయలుదేరిన ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం జిల్లా అధ్యక్షుడు కంగల శ్రీనివాస్‌ను దేవీపట్నం పోలీసులు స్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. గిరిజన సంఘం నేతలు తీగల శ్రీనివాసు, సాదల విద్యాసాగర్‌ను సిపిఎం కార్యాలయం వద్ద రంపచోడవరం పోలీసులు అరెస్టు చేశారు.

అక్రమ అరెస్టులు దారుణం

అరకులోయ/ రూరల్ : బోయ/వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడంతో తమకు జరిగిన అన్యాయంపై పోరాడుతున్న గిరిజన సంఘం నేతలను గృహనిర్బంధం, అక్రమ అరెస్టలతో ఉద్యమాలు ఆగవు సరికదా, రెట్టించిన ఉత్సాహంతో తీవ్రమౌతాయని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర హెచ్చరించారు. మంగళవారం అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, రంపచోడవరం జిల్లా కార్యదర్శి సిరిమల్లె రెడ్డి, శ్రీకాకుళం జిల్లా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ధర్మారావు, ఎస్‌గురునాథ్, ఎస్ పాల్గుణరావు, ఇతర నేతల నిర్బంధం అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిని పరామర్శించేందుకు వెళ్లిన సిఐటియు నేత ఆర్ దిలీప్‌కుమార్, రైతుసంఘం నాయకులు ఎం.ధర్మారావులను కూడా అరెస్టు చేయడం సరికాదన్నారు. వారిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బోయ/ వాల్మీకి వ్యవహారంపై గిరిజన సలహా మండలి, గిరిజన సంఘాలతో కనీసం సంప్రదించకుండా ఏకపక్షంగా అసెంబ్లీలో అడ్డగోలు తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం గిరిజనుల గొంతు కోయడమేనని స్పష్టం చేశారు. దీనిపై ప్రశ్నించేవారిని, శాంతియుతంగా ఉద్యమించి, నిరసన తెలియజేసేవారిని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి వెనక్కు తగ్గకుంటే, పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రంపచోడవరం :రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన నేపథ్యంలో గిరిజన నేతల ముందస్తు అరెస్టు, గృహ నిర్బంధాన్ని పలువురు గిరిజన నాయకులు తీవ్రంగా ఖండించారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావుతో పాటు రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లో పలువురు గిరిజన నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామ్యకమని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు అన్నారు. జిఒ52 తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు.

విఆర్.పురం : గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి నాయకులను హౌస్ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఆదివాసీ జేఏసీ నాయకులు పూనెం ప్రదీప్ కుమార్ తీవ్రంగా ఖండించారు. రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ధనలక్ష్మి ఆదేశాల మేరకే పోలీసులు ముందస్తు అరెస్టులకు పూనుకున్నారని విమర్శించారు. అక్రమ అరెస్టులు ఆపకుంటే ఎమ్మెల్యే ధనలక్ష్మిని నియోజకవర్గంలో తిరగనిచ్చేది లేదని హెచ్చరించారు. ఆదివాసీల ఓట్లతో గెలిచి అదే ఆదివాసీల ఆత్మ గౌరవాన్ని ముఖ్యమంత్రికి గిరిజన ఎమ్మెల్యేలు తాకట్టు పెట్టారన్నారు. సమావేశంలో ఆదివాసీ జేఏసీ, గిరిజన సంఘం నాయకులు పండా వెంకటేష్, వేటకని సూరిబాబు, చిక్కాల రామారావు, తోడం రాజు పాల్గొన్నారు.

రంపచోడవరం : గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమని ఆదివాసీ సాంస్కృతిక, సంక్షేమ సంఘం నాయకులు చవలం శుభ కృష్ణదొర, కంగల అబ్బాయి దొర పేర్కొన్నారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న గిరిజనులను భయభ్రాంతులుకు గురి చేయడం దుర్మార్గమన్నారు. జీవో నెంబర్ 52ను ప్రభుత్వం ఉపసంహరించుకోకపోతే గిరిజన ఐక్య ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

ఫుడ్ కమిషన్ చైర్మన్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - రంపచోడవరం

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్ రెడ్డి రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం, వై.రామవరం మండలాల్లో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. రంపచోడవరం మండలం రంప గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల, రంప, గాంధీనగరం అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రంప అంగన్వాడీ కేంద్రంలో ప్రతిరోజు ఏ ఆహార పదార్థాలు పెడుతున్నదీ పిల్లలను, గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పెట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు ఆటపాటల ద్వారా పిల్లలకు విద్యపై అవగాహన కల్పించాలని సూచించారు. రంప గిరిజన ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు పెడుతున్న గుడ్లును పరిశీలించారు. గుడ్లు 50 గ్రాముల కన్నా తక్కువ బరువు ఉండటంతో సంబంధిత కాంట్రాక్టర్లతో ఫోన్లో మాట్లాడారు. 50 గ్రాముల కన్నా గుడ్లు బరువు తక్కువ ఉంటే కాంటాక్టను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి, సివిల్ సప్లై డిప్యూటీ డైరెక్టర్ పి సురేష్, జిల్లా సివిల్ సప్లై అధికారి ఆర్.శివప్రసాద్, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, సివిల్ సప్లై డిఎం గణేష్ కుమార్, సిడిపివోలు సంధ్యారాణి, ప్రసన్న కుమారి, ఏఎంఒసి శ్రీహరి, మండల విద్యాశాఖ అధికారి ఎం.సత్యనారాయణ దొర, జిసిసి సీనియర్ మేనేజర్ మూర్ల నాగ రాజారెడ్డి పాల్గొన్నారు.

అడ్డతీగల : అడ్డతీగల గిరిజన సహకార సంస్థ గొడౌన్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. సరఫరా అవుతున్న బియ్యం బస్తాలను తూనకం వేయగా, వ్యత్యాసం రావడాన్ని గమనించి దానిపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గురుకులం పాఠశాలను పరిశీలించి మెనూ సక్రమంగా అమలవుతుందా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. గంగవరం, వై.రామవరం మండలాల్లో కూడా ఈయన పర్యటించి ఆయా పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట జిపిసీఎం సొసైటీ డివిజనల్ మేనేజర్ పార్వతీశం, ఏటిడబ్ల్యూ హాసిని, పౌర సరఫరా శాఖ డిఎం గణేష్ కుమార్, ఏఎస్‌ఓ శ్రీహరి, జిసిసి బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖరరావు, సూపరింటెండెంట్ బాబురావు ఉన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగిస్తున్న గిరిజనులు

మండలంలో భారీ వర్షం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదై, ఎండ వేడికి తట్టుకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో మంగళవారం మధ్యాహ్నం మండలంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలకు వెళ్లే రహదారులలో రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షాలు నెలకొరిగాయి. మారేడుమిల్లి మండలం నుండి వేటుకూరు గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో రహదారి గుండా ఎవరు రాకపోవడంతో ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. సుమారు మూడు గంటల పాటు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అటువైపుగా వెళ్తున్న గిరిజనులు అందరూ కలిసి భారీ వృక్షాన్ని మిషన్ సహాయంతో కట్ చేసి తొలగించారు. అనంతరం రాకపోకలు సాగాయి.

నాణ్యంగా జలజీవన్ మిషన్ పనులు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జల్ జీవన్ మిషన్‌లో చేపట్టిన తాగునీటి పథకాల నిర్మాణాలలో పటిష్టమైన నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో తాగునీటి పథకాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైపులు, మోటార్లు, ఇతర సామగ్రి కొనుగోలులో నాణ్యతలు పాటించాలని సూచించారు. తాగునీటి పథకం నిర్మాణం, నీటి సరఫరాలో గ్రామస్తుల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. విద్యుత్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని వస్తే ట్రాన్స్ కో అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు.

పాడేరు డివిజన్ పరిధిలో 3288 స్కీముల పనులు జరుగుతున్నాయని, వాటిని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి పథకాల నిర్మాణాల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శికి ఫోన్ చేసి, ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి రూ.28 కోట్ల 50 లక్షల బిల్లులు ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేసామని. అల్లూరి జిల్లాను ప్రత్యేకంగా భావించి నిధులు విడుదల చేయాలని కోరారు సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ లీలాకృష్ణ , పాడేరు, అనంతగిరి డిఇఇలు జివి.ఎస్. ప్రకాష్, ఎం.జయరామ్, 11 మండలాల ఎఇఇలు పాల్గొన్నారు.

ఫేషియల్ అటెండెన్స్‌కు ఉద్యోగుల పాట్లు

సెల్ సిగ్నల్స్ కోసం కొండెక్కిన ఉద్యోగులు

ప్రజాశక్తి -దుంబ్రిగూడ : మండలంలోని మారుమూల సొవ్వా పంచాయతీలో సెల్ సిగ్నల్ సౌకర్యం లేక అక్కడ పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు ఫేషియల్ అటెండెన్స్ కోసం తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది. సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి చేయడంతో ఈ సచివాలయ పరిధిలోని ఉద్యోగులు వచ్చిన వెంటనే గ్రామానికి సమీపంలో ఎత్తైన కొండ ప్రాంతానికి వెళ్లి, అక్కడక్కడ వచ్చే సిగ్నల్స్ కోసం సెల్‌తో కుస్తీలు పడుతూ, అన్నీ బాగుండి సిగ్నల్ దొరికితే అటెండెన్స్ వేసుకుని , ఆ రోజుకు పని అయిపోయిందని హమ్మ అంటూ కొండ దిగువనున్న సచివాలయానికి వచ్చి విధుల్లో నిమగ్నమౌతారు. ఇక్కడ ఉద్యోగులకు ఇది నిత్య కృత్యంగా మారింది. మంగళవారం ఉదయం అక్కడి సచివాలయ ఉద్యోగులు కొండెక్కి ఫేషియల్ అటెండెన్స్ కోసం పడుతున్న పాట్లును పరిశీలించిన ప్రజాశక్తి ప్రతినిధి వాటిని ఫొటో తీశారు.

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార భేరి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

మాట్లాడుతున్న మంతెన సీతారాం, చిత్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్, ఇతర నాయకులు

ప్రజాశక్తి-చింతూరు

కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14నుంచి 30వ తేదీ వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రచార భేరిని జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. చింతూరులో మంగళవారం మనకం చిన్నయ్య అధ్యక్షతన జరిగిన మండలం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తన 9 ఏళ్ళ పాలనలో అదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ ప్రజల సంపదను దోసిపెట్టిందని విమర్శించారు. దేశ ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికొదిలేసి దేశంలో అత్యంత ధనవంతులుగా అంబానీ అధానీలను మార్చడమే ఏజెండాగా పరిపాలన సాగిస్తుందని పేర్కొన్నారు. మతాలు, కులాల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలికలు తెచ్చి పబ్బంగడుపుకుంటుందని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని తెలిపారు. విభజన హామీలను తుంగలోకి తొక్కి విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేస్తున్నా నోరు మెదపడం లేదని, పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకున్నా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సీతారామయ్య, మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు పల్లపు వెంకట్, మల్లం సుబ్బమ్మ, పోడియం లక్ష్మణ్, మడకన్ చిన్నయ్య, కారం సుబ్బారావు, ఎం.రాజయ్య, రంగమ్మ, కుమ్మూరు ఎంపీటీసీ లేక రాజ్ కుమార్ పాల్గొన్నారు.

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో పంకు సత్తిబాబు అధ్యక్షతన మంగళవారం సిపిఎం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంటింటికీ సిపిఎం, సిపిఐ కార్యకర్తలు కలిసి ప్రచార కార్యక్రమం చేపట్టాలని సూచించారు. పోలవరం ముంపు నిర్వాసితుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను మరిచి వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల నాయకులు కారం సత్తిబాబు, జి.లక్ష్మణరావు, శ్రీరామ్మూర్తి, కుంజ నాగిరెడ్డి, హజరత్, తుర్రం బాబురావు, చిక్కాల రామారావు, కాంతారావు, వల్ల కృష్ణారెడ్డి, సోడి మల్లయ్య, కావడం రాజు, దారయ్య, చిన్నమట్టపల్లి ఎంపీటీసీ పూనం ప్రదీప్ కుమార్, రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజినీ, రామవరం. సర్పంచ్ కారం బుజ్జమ్మ, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి పాల్గొన్నారు.

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - రంపచోడవరం

వైయస్సార్ ఆసరా పథకం ద్వారా రుణాలు తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రంపచోడవరం శాసనసభ్యులు నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం వైయస్సార్ ఆసరా పథకం చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 640 మహిళా సంఘాలకు చెందిన 5199 మంది మహిళలకు రూ.2,24,54,000 రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సందేశాన్ని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంధం శ్రీదేవి, జెడ్పిటిసి పండా వెంకటలక్ష్మి. వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండ కుమారి, రంపచోడవరం సర్పంచ్ ఎం.బుజ్జయ్య. ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, వెంకటేశ్వర్లు దొర, షేక్ లాల్, డోకులూరి రత్నం రాజు, కారుకోడి పోచమ్మ, జె.రామన్న దొర, దండంగి సింహాద్రి, బి శేఖర్, డి. రామారావు, వి ప్రసాద్, ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు, ఏపిఎం అప్పారావు. పాల్గొన్నారు.

ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

తునికాకు పనులు ప్రారంభించాలని ధర్నా

- పెండింగ్ బోనస్‌లు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి -ఎటపాక

ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారులు స్పందించి వెంటనే టెండర్లు పిలిచి తునికి ఆకు పనులు ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న తునికి ఆకు బోనస్‌ను వెంటనే చెల్లించాలని కోరుతూ తునికాకు సేకరించే గిరిజన కార్మికులు సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ఫారెస్టు రేంజర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఇప్పటి వరకు తునికాకు బోనస్ రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారులు ప్రతి ఏటా తునికాకు సీజన్‌ను పట్టించుకోవటం లేదని, దీని వల్ల గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇంత వరకు టెండర్‌లు పిలవ లేదని, ప్రూనింగ్ ప్రారంభించ లేదని పేర్కొన్నారు. తునికాకు సేకరణ అంతంత మాత్రంగానే జరుగుతుందని, కట్టరేటు కూడా నామ మాత్రంగానే ఉందని, పెరిగే ధరలకు అనుగుణంగా కట్టరేటు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కాకా అర్జున్, రాము, పద్మ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు

జ్యోతిరావు పూలేకు ఘననివాళి

అరకులోయ: సామాజిక విప్లవ పితామహుడు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతిని అరకులోయలోని గిరిజన సంఘం కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి బాలదేవ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర, బాలదేవ్ మాట్లాడుతూ, సామాజిక సమానత్వం, చైతన్యం కోసం జీవితాంతం కృషి చేసిన పూలే మార్గం అనుసరణీయమని, మనుషులంతా సమానమేనని కుల వివక్షతకు వ్యతిరేకంగా గొంతెత్తి ప్రశ్నించి, ఆచరించి చూపించిన మహనీయుని కొనియాడారు. పూలే ఆశయ సాధనకు సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు, హత్యలు పెచ్చరిల్లిపోతున్నాయని,దీనికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కొమ్ము కాయడం విచారకరమన్నారు. కడపలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అచ్చన్న హత్య, కాకినాడ జిల్లా శంగవరపులో తొండంగి దళిత యువకుడు నాడిపల్లి రామ హత్య, నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో కొలిచలక, దళితుడు తలారి రవికుమార్‌పై దాడి, అక్రమ కేసు బనాయింపు, రంపచోడవరంలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి డోర్ డెలివరీ, వాకపల్లి అత్యాచార బాధిత గిరిజన మహిళలకు జరిగిన అన్యాయం తదితర ఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. దళిత, గిరిజన చట్టాల పరిరక్షణకు మండలకేంద్రంలో పూలే దీక్ష చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు దళిత గిరిజన ప్రజాసంఘాల నేతలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, ప్రజలు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఐక్యపోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.ప్రభుదాస్, చినబాబు మాజీ సర్పంచ్ అనస్ బ్యాంక్ అధ్యక్షులు జి. భాగ్యవతి, ప్రైవేట్ విద్యాసంస్థల అధ్యాపక సంఘం అధ్యక్షులు ప్రసాద్, శ్రీను, కొండలరావు, కౌసల్య, లక్ష్మీప్రియ, మాణిక్యం, పద్మ బాలకృష్ణ పాల్గొన్నారు.

పాడేరులో పూలేకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో పూలే చిత్రపటానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల హక్కులు, మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన సంఘసంస్కర్త, సమాజంలో కులవివక్షత రూపుమాపడానికి తన జీవితాన్ని ధారపోసిన మహోన్నతుని కొనియాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఆర్‌ఓ పి.అంబేద్కర్, అధికారులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు మండలంలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ, నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలిత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు జ్యోతిరావుపూలే చేసిన కృషి వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కోడేడ త్రిమూర్తులు, తాతిశెట్టి మృత్యుంజయ మోహన్, తాడితూరి శ్రీనివాస్, కరుకు అప్పారావు, లోవరాజు, వినయ్ తాటికూన చిన్న లక్ష్మీనరసింహ, చంద్రం, శివ, శంకరం, అప్పారావు, సూరిబాబు, బాబూరావు, వీరబాబు, వేణు, పండు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి వార్డెన్ ఎం.తాతాజీరావు, ఉపాధ్యాయులు శామ్యూల్, అనుచచిత్ జాతి నాయకులు చదలవాడ కృప కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావుపూలే అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో జ్యోతిరావు

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత సురేంద్ర

పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్నమాణిక్యం మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సావిత్రి బాయి పూలే దంపతులు ఆనాటి సమాజంలో ఉన్న దురాచారాలను రూపు మాపటానికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.భారతి, కె.శకుంతల, వై పద్మ, కె.తైజ, ఎం నాగమోహన్ రావు, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంక్ ఎదురుగా బీసీ వెల్ఫేర్ కార్యాలయం వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి ఏపీ జెన్కో ఎస్ఈ కెవిఎ.ప్రశాంత్ కుమార్, ఈఈ లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే తన భార్య సావిత్రి బాయిని చదివించి భారతదేశంలో మహిళా విద్యకు పునాదులు వేశారని తెలిపారు. ఆయన ఆదర్శాలు ఆయన అడుగుజాడల్లో నడిచిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, బిసి వెల్ఫేర్ నాయకులు కె.సత్యనారాయణ, ప్రసాదు, జి.శివప్రసాద్, ఈవివి.సత్యనారాయణ, ఏపీ జెన్కో ఏడిఈ సత్యనారాయణ, ఏడి అప్పలనాయుడు, ఏఈలు సురేష్, అప్పలనాయుడు, రమేష్, సీతారాం, సబ్ ఇంజనీర్లు శ్రీను, డి.నాగేష్, వైద్యాధికారి సౌమ్య పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో వృత్తిదారుల నివాళి

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలను నిర్వహించారు. అంబేద్కర్ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు చెండా భీమ్ సుందర్, ఎం.వెంకటేశ్వరనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని ఆరు పాఠశాలలకు చెందిన 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 14న అంబేద్కర్ జయంతి రోజున బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చెండా బాలకృష్ణ, అంబేద్కర్ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి,జె రవి రాజా, హిందీ పండిట్ రవి, పసుపుల కోటి బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల వద్దకే రేషన్ అందించాలి

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల వద్దకు రేషన్ సరుకులు సక్రమంగా అందించే చర్యలు చేపట్టాలని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు . మంగళవారం పాడేరులో నిర్వహించిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, అల్లూరి జిల్లా కార్యవర్గం సమావేశంలో మాట్లాడుతూ అరుకు ప్రాజెక్ట్ మీటింగ్ జరపడం లేదని ప్రతినెల ప్రాజెక్ట్ మీటింగు జరపాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాజెక్ట్ మీటింగ్‌కు టిఎ, డిఎలను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీతం పెంచాలని, .మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, కొన్ని ప్రాజెక్టు కార్యాలయాల్లో సమావేశాలు జరుపుకోవడానికి షెల్టర్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.. ఈ సమస్యలపై ఈనెల 21న జిల్లా కలెక్టర్, పీడీలను కలిసి విన్నవించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, ముత్యాలమ్మ, వెంకటలక్ష్మి, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -జి మాడుగుల : మండలంలో రోడ్డు ప్రమాదాలను నివారణకు పోలీసులు పటిష్టం చర్యలు చేపడుతున్నారు. స్థానిక పోలీసులతోపాటు 198 సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ ప్రత్యేక పోలీసులు బాధ్యతగా ముందుకు వచ్చి ఐరన్ డబ్బాలు, వాహనాలు టైర్లును ఉపయోగించి ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారు జి మాడుగుల పరిధిలో కలవ పువ్వులు జంక్షన్, ఈదులబయలు జంక్షన్, జి.మాడుగుల, కొత్తూరు జంక్షన్‌లో ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ స్టాపర్స్‌ను గుర్తించి, మలుపుల వద్ద వాహనదారుల వేగాన్ని తగ్గించుకుంటే ప్రమాదాలు వాటంతట అవే తగ్గుతాయన్నారు. ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో 198 సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ పోలీసులు, కె.కూడాపల్లి సర్పంచ్ ప్రతినిధి వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్ అప్పలరాజు, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, కిషోర్, చిన్నబాబు, శివ పాల్గొన్నారు.

నేడు ఇంజరిలో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఇంజరిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని, వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా ఎస్‌పి తుహింసిన్హా ఐటిడిఎ పిఒ అభిషేక్ హాజరుకానున్నారని తెలిపారు.

మెగా వైద్యశిబిరంలో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడీషియన్, పీడియాట్రీషియన్, తదితర వైద్యనిపుణులు పాల్గొని, రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. వైద్యశిబిరానికి వచ్చే రోగులకు ఉచిత భోజన సదుపాయంతోపాటు 198 సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో దోమ తెరలను పంపిణీ చేస్తారన్నారు. దీర్ఘకాల రోగాలు, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని గుర్తించి, పోలీసుశాఖ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలిస్తామన్నారు.

ఆరు పంచాయతీల జట్లుతో వాలీబాల్ టోర్నీ

గిరిజన యువతలోని క్రీడానైపుణ్యాన్ని వెలికితీసి, ప్రోత్సాహించే లక్ష్యంతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇంజరిలో వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు సిఐ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఇంజరి, జామిగుడ, గిన్నెలకోట, లింగేటి, బొంగరం, జి.మాడుగుల మండలం బొయితిలి తదితర ఆరుపంచాయతీల పరిధిలోని 50మంది యువకులు వాలీబాల్ టోర్నీలో పాల్గొంటారన్నారు. విజేతలకు రూ.25వేలు, రన్నరప్‌కు రూ.15వేలుతోపాటు మూడోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు నగదు బహుమతిని ఇవ్వనున్నట్లు సిఐ వెల్లడించారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులకు వాలీబాల్, నెట్‌లతోపాటు జెర్సీలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ ఉన్నారు.

పిఎసిఎస్‌ల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా

17న కలెక్టరేట్ వద్ద ధర్నా : సిఐటియు

ప్రజాశక్తి పాడేరు :– వ్యవసాయ పరపతి సహకార సంఘాలు,(పిఎసిఎస్)లలోని 50 శాతం వాటాలను ప్రైవేటుకు కట్టపెట్టాలని వైసిపి ప్రభుత్వం చేస్తున్న కుట్రను వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్, అల్లూరి జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. దీనిపై ఈ నెల 17న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వమించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం పాడేరులో జరిగిన జిల్లా కార్యవర్గం సమావేశంలో మాట్లాడుతూ 1964 ఎపి సహకార సంఘాల చట్టానికి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సవరణలు చేస్తూ, సభ్యరైతులను తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిఒ 36 ప్రకారం వేతనాలు ఇతర బెనిఫిట్స్ తక్షణం అమలు చేయాలని కోరారు. సహకార ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును 62ఏళ్లకు పెంచాలని,. 2019 ఏప్రిల్ ఒకటి నుండి కొత్త వేతన సవరణ చేయాలని కోరారు. పిఎసిఎస్‌ల పరిరక్షణ, ఉద్యోగులకు. భద్రత, (.ప్రైవేట్ వ్యతిరేకంగా చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు సిఐటియు అండగా ఉంటుందని భరోసానిచ్చారు.. యూనియన్ జిల్లా అధ్యక్షులు బికె.అబీన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని పలు సొసైటీల సభ్యులందరూ హాజరయ్యారు.

ఇవిఎంలు భద్రపరచడానికి భవనాల పరిశీలన

ప్రజాశక్తి -పాడేరు : ఇవిఎంలను భద్రపరచడానికి అనువైన భవనాలను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాత బాలికల వసతి గృహాన్ని ఇవిఎం గొడౌన్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. కుమ్మరిపుట్టు గురుకులం ఎదురుగా ఉన్న మినీ స్టేడియం (ఆర్చరీ శిక్షణ) భవనాన్ని పరిశీలించారు. డిగ్రీ కళాశాల భవనంలోని మూడు ప్రభుత్వ కార్యాలయాలలో ఒకదాన్ని ఆర్చరీ శిక్షణ భవనానికి తరలిస్తామని, మిగిలిన రెండు కార్యాలయాలకు ఐటిడిఎలో వసతి కల్పిస్తామన్నారు. ఆర్చరీ శిక్షణ కేంద్రానికి రంగులు వేసి మరుగుదొడ్ల మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా డిగ్రీ కళశాలలో పరిశీలించిన భవనానికి కిటికీలను పూర్తిగా మూసేయాలని సూచించారు కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డివిఆర్‌ఎం. రాజు, డిఇఇ. అనుదీప్ తహశీల్దార్ వి. త్రినాధరావు నాయుడు పాల్గొన్నారు.

భూరికార్డుల నిర్వహణపై శిక్షణ

పాడేరు : డిఫారం పట్టా భూములను పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల తహశీల్దార్లు, విఆర్ఒలకు డిపట్టా భూముల గుర్తింపు, రికార్డులు నిర్వహణపై ఒక రోజు శిక్షణలో మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు, పట్టా భూములకు ప్రత్యేకంగా ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లు (ఎల్‌పిఎం) తయారు చేయాలని స్పష్టం చేసారు. పట్టా భూములు, ఎస్సైన్‌మెంట్ భూములు రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. భూముల రికార్డుల సక్రమంగా నిర్వహించి పూర్తి వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రైతులంతా రైతు భరోసా, పంటల బీమా, వ్యవసాయ రాయితీలు పొందే విధంగా తగని చర్యలు చేపట్టాలన్నారు. భూముల రీసర్వే పకడ్బందీగా చేయాలని సూచించారు. విఆర్ఒలకు భూముల వివరాలపై అవగాహన ఉండాలని, డి ఫారం పట్టా, ఎస్సైన్డ్ భూముల, సర్వే నంబర్లు, అడంగళ్‌లో నమోదుపై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు, సర్వే ఇన్‌స్పెక్టర్ ఎస్.నాగేశ్వరరావు, పాడేరు, జి .మాడుగుల తహశీల్దార్లు వి.త్రినాధరావు నాయుడు, అప్పల స్వామి, విఆర్ఒలు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు : పోలీసులు గంజాయి స్మగ్లర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. జీకే వీధి మండలం సీలేరు ప్రధాన కుడళ్ళలో మంగళవారం సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానితులపై నిఘా పెట్టి ఆరా తీశారు. ఇటీవల బీటెక్ విద్యార్థి గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన నేపథ్యంలో యువకులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు ముమ్మరం చేశారు. స్థానిక ఏపీ జెన్కో చెక్ పోస్ట్ వద్ద ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చే పలు వాహనాలను నిలిపివేసి రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెట్టారు. ఐటిఐ జంక్షన్, రామాలయం సెంటర్ తదితర ముఖ్య కుడళ్లలో తనిఖీలు నిర్వహించారు.

ఒప్పంద పత్రాలతో ప్రతినిధులు

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఎంఒయు

ప్రజాశక్తి–అచ్యుతాపురం, విశాఖ కలెక్టరేట్ : ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్, విశాఖపట్నం బిఎస్ఎన్ఎల్ మధ్య మంగళవారం ఎంఒయు కుదిరింది. నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాలలో బిటెక్, డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ ఎంఒయు ప్రకారం అందజేయనున్నట్లు ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ డిజిఎం జి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ సదావకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు, చదువుతున్న విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జి.ప్రసాదరెడ్డి, బిఎస్ఎన్ఎల్ తరపున డిజిఎం సత్యప్రసాద్, ఎజిఎం బిఎస్ శ్రీనివాస్, ఎస్‌డిఇ తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు. 2019లో అచ్యుతాపురం సెజ్‌లో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ. 250 కోట్లతో ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటైంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కావలసిన టెక్నాలజీ సహకారం అందిస్తోంది. పరిశ్రమలకు అవసరమైన యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తోంది.

అన్వి సిస్టమ్స్ నుంచి గ్రాఫేన్ టెక్నాలజీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అన్వీ సిస్టమ్స్ తన అధునాతన ఓరా మెమొరీ, ఎన్‌విఎంఇ స్టోరేజీ పరికరాలను వినూత్న గ్రాఫేన్ టెక్నాలజీతో ప్రారంభించిందని సంస్థ సహ వ్యవస్థాపకులు, సిఇఒ ఉదయ్ కిరణ్ కొణితాల తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధునాతన ఉత్పత్తులు అసమానమైన పనితీరు, మెరుగైన సామర్థ్యం, అధిక కాలం మన్నికకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాయన్నారు. గ్రాఫేన్ టెక్నాలజీని చేర్చడం ద్వారా అన్వీ సిస్టమ్స్ ఓరా ఉత్పత్తులు సరైన ఉష్ణ నిర్వహణను నిర్ధారిస్తాయని, థర్మల్ థ్రోట్లింగ్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని అన్నారు. మరింత సమాచారం కోసం www.anwisystems.comని సందర్శించాలని కోరారు.

నిధుల కొరత

- రూ.33 కోట్లకు ఆర్‌డబ్ల్యుఎస్ ప్రతిపాదనలు
- విడుదల చేయని జెడ్‌పి
- వేసవొచ్చినా కదలని తాగునీటి పథకాల పనులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వేసవి రోజులు రావడానికి ముందే తాగునీటి వనరులను సిద్ధంచేయాల్సిన గ్రామీణ తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) విభాగం డబ్బుల్లేక చతికిలపడింది. తాగునీటి వనరుల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి డబ్బులురాక, జిల్లా పరిషత్ నిధులు విడుదల కాక రక్షిత మంచినీటి పథకాలు (సిపిడబ్ల్యు) మరమ్మతులు, నిర్వహణ చేయలేని అచేతనస్థితిలో వుంది. వేసవి రోజుల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా బోర్లు, బావులు, సిపిడబ్ల్యు, పిడబ్ల్యుఎస్ పథకాల తీరు మెరుగుపర్చే పని ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తిచేయాల్సి వుంది. డబ్బుల్లేకపోయినా తమ పరిధిలో చేయదగిన క్రాస్ ప్రోగ్రాం కింద బోర్ల నిర్వహణ వరకు అనకాపల్లి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చేపట్టారు. తెలిసిన కాంట్రాక్టర్, వ్యాపారులను బతిమలాడుకొని పనిముట్లు, బోర్లు మరమ్మతు పనుల వరకు చేయగలిగారు. తలకు మించిన భారం కావడంతో సిపిడబ్ల్యుఎస్ పథకాల నిర్వహణను వదిలేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 43 సిపిడబ్ల్యు పథకాల నిర్వహణకు జిల్లా పరిషత్ నుంచి నిధులు రాకపోవడంతో ఆ పథకాల పనుల జోలికి వెళ్లలేదు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 43 సిపిడబ్ల్యు పథకాల నిర్వహణకు దాదాపు రూ.33 కోట్లు అవసరమని ప్రతిపాదనలు ఆర్‌డబ్ల్యుఎస్ విభాగ అధికారులు జిల్లా పరిషత్‌కు పంపారు. వేసవి రోజులొచ్చినా ఇంతవరకు ఆర్‌డబ్ల్యుఎస్ ప్రతిపాదిత నిధులకు పరిపాలనా ఆమోదం ఇవ్వలేదు. దీంతో సిపిడబ్ల్యుఎస్ పథకం పనుల మరమ్మతులు, విడిభాగాల కొనుగోలు వంటి పనులేవీ చేపట్టలేదు. బిల్లులు సకాలంలో విడుదలకానందున తెలిసిన కాంట్రాక్టర్లు కూడా పనులు చేసేందుకు ముందుకురావడంలేదు. అనకాపల్లి జిల్లాలో 29, పాడేరు డివిజన్‌లోని 11, విశాఖపట్నం జిల్లాలోని మూడు రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు రూ.33 కోట్లు అవసరంకానుంది. ఈ పథకాల నిర్వహణ చూడాల్సిన జిల్లా పరిషత్ వద్ద కూడా నిధుల్లేకపోవడంతో ప్రతిపాదిత పనులకు నిధులు ఇవ్వలేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు జెడ్‌పికి సరిగా జమకావడంలేదు. 2021–22లో జమైన రూ.26 కోట్లలో మార్చి నెలాఖరున పాత బకాయిల్లో పది కోట్ల రూపాయలు చెల్లించింది.

2022–23 ఆర్థిక సంవత్సరంలో పైసా కూడా జెడ్‌పి ఖాతాలో జమకాలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో జెడ్‌పి కింద చేపట్టాల్సిన పనులేవీ చేపట్టలేకపోతున్నామని తెలిపారు. తాగునీటి పథకాలు నిర్వహణ వీలైనంత తొందరగా మెరుగుపర్చకపోతే, రాబోయే వేసవి రోజుల్లో తాగునీటి సమస్య గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రంకానుంది. సిపిడబ్ల్యు పథకాల నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం వచ్చిన రూ.33 కోట్ల ప్రతిపాదనలపై త్వరలో నిర్ణయం తీసుకొని నిధులు విడుదల చేస్తామని జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి పి.శ్రీరామమూర్తి 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఉక్కుపై కేంద్రం కుట్రలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను తిప్పికొడతామని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 740వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ నాయకులు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చొరవ చూపడం లేదన్నారు. పోరుగునున్న తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాన్ని జగన్ ప్రభుత్వం గమనించాలన్నారు. ప్రభుత్వ రంగంతోనే దేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జోన్ నాయకులు వి.కృష్ణారావు, కె.కుమారి, అనపర్తి అప్పారావు, పితాని అప్పారావు, ప్రొఫెసర్ ఎస్.సూరప్పుడు, డి.విజ్ఞానంద్, పోతురాజు, కనకరాజు, డి.రాజేశ్వరి పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

నేడు జి.సుబ్బారావు సంతాప సభ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాక

ప్రజాశక్తి - గాజువాక : సిపిఎం గాజువాక సీనియర్ నాయకులు జి.సుబ్బారావు సంతాప సభ బుధవారం ఉదయం 10:30 గంటలకు షీలానగర్‌లోని ఆయన స్వగృహానికి సమీపంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ గ్రౌండ్ వద్ద జరుగనుంది. ఈ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, తదితరులు హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ప్రజాశక్తి బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. సభకు పెద్ద ఎత్తున ప్రజలు రానుండటంతో ఇప్పటికే సుబ్బారావు కుటుంబీకులు పెద్ద ఎత్తున టెంట్లు వేశారు. ఇతర సౌకర్యాలు కల్పించారు. ఈ క్రమంలోనే పలువురు సుబ్బారావుతో ఉన్న అనుబంధాన్ని వివరించారు.

సీలేరులోని శీతల పానీయ దుకాణం వద్ద ఉపశమనం పొందుతున్న వాహనదారులు

మండిన ఎండ

ప్రజాశక్తి - సీలేరు : మంగళవారం భానుడు భగభగ మండిపోయాడు. ఏప్రిల్‌లో గతంలో ఎప్పుడూ లేనంతగా రెండు రోజులుగా అధిక ఉష్ణోగ్రతతో ఎండలు కాయడంతో జీకే వీధి మండలం సీలేరు ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చెరుకు రసం, పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు, శీతలపానీయలతో ప్రజలు వేసవి తాపం నుండి ఉపశమనం పొందుతున్నారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో ఎండ వేదిక అధికంగా ఉండడంతో పాటు వడగాల్పులు కూడా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు ప్రకాశాంతంగా కాస్తూ ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మంగళవారం 35 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలుస్తోంది. దీంతో ఉదయం 10 గంటల తరువాత రోడ్లపై జన సంచారం పెద్దగా లేదు. దీంతో వృద్ధులు, పిల్లలు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. అనంతరం క్రమేపి ఎండ తగ్గడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికొస్తున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత మరింత అధికమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తత అవసరం

డుంబ్రిగూడ: ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మానవ హక్కుల నేరనిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళా అధ్యక్షురాలు కష్ణకుమారి సూచించారు. బయట ఎక్కువసేపు తిరగకుండా, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు ప్రకటిస్తున్నారన్నారు. ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, బయట తిరిగే వారు తగిన నీళ్లు, ద్రవపదార్థాలను ఎప్పటికప్పుడు తీసుకుంటూ ఉండాలని సూచించారు.

రోబోటిక్ ప్రాజెక్టు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కెకెఎల్ ఎలక్ట్రికల్ లిమిటెడ్‌గా గతంలో పేరుగాంచిన ఎడ్వెన్సా ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ బిగ్ ఫోర్ కన్సల్టింగ్ కంపెనీతో వ్యూహాత్మక రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ స్పేస్‌లో ప్రాజెక్టు ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉప్పులూరి శ్రీనివాస శ్రీకాంత్ విశాఖలో మీడియాతో మాట్లాడారు. ఆల్ ఫిజికల్ రోబోట్‌లతో కూడిన డిజిటల్ వర్క్‌ఫోర్స్‌తో శ్రామిక శక్తి ఉత్పాదకతను పెంపొందించే విధానాన్ని మార్చడానికి చొరవ ప్రారంభించామన్నారు. మనుషుల మాదిరిగానే సాఫ్ట్‌వేర్ రోబోట్లు స్క్రీన్‌పై ఏముందో అర్థం చేసుకోవడం, సరైన కీస్ట్రోక్‌లను పూర్తి చేయడం, సిస్టమ్‌లను నావిగేట్ చేయడం, డేటాను గుర్తించడం, సంగ్రహించడం వినియోగదారు నిర్వచించిన అనేక రకాల చర్యలను చేపట్టడం ప్రత్యేకతని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య విశాఖ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు మంగళవారం జరిగాయి. అధ్యక్షునిగా జెఎం.నాయుడు, ప్రధాన కార్యదర్శిగా జిటివి.సుదర్శన్ పట్నాయక్ ఎన్నికయ్యారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా ప్రొఫెసర్ పుల్లారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరుణాకరరావు, ఉపాధ్యక్షులుగా నీలాపు శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, కార్యదర్శులుగా విష్ణుమూర్తి, భార్గవ్, వల్లే శ్రీను, హెన్నా, కోశాధికారిగా చిరంజీవి, ప్రచార కార్యదర్శులుగా శ్రీరామమూర్తి, అప్పలనాయుడు, కెఎల్.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర నాయకులు పొలాకి శ్రీనివాసరావు, కన్వీనర్ ఖాదర్ బాబా వ్యవహరించారు.